గుండె పోటుతో ఎస్ఐ మృతి -5లో..

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



గోదారి నీరొచ్చే..



ఒకేసారి పట్టిసీమ, తాడిపూడి నుంచి నీటి విడుదల

- రైతుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం
- ప్రత్యేక కార్యాచరణతో కూటమి ప్రభుత్వం ముందడుగు
- ప్రాధాన్యతా క్రమంలో ప్రాజెక్టులు పూర్తి : మంత్రి నిమ్మల

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

గోదావరి జలాలను పట్టిసీమ, తాడిపూడి ఎత్తిపోతల ద్వారా ఒకేరోజు నీటిని విడుదల చేయడం, ఒక అరుదైన రికార్డు. ఈ రికార్డును బుధవారం జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు సాధించగలిగారు. గోదావరిపై వున్న ఎత్తిపోతల పథకాల ద్వారా ఒకేసారి రైతులకు సాగు నీరందితే ఖరీఫ్ సజావుగా సాగుతుందని, పంటలు చేతికి వస్తాయని, పెట్టుబడులతోపాటు తగినంత రాబడి, రైతుకు కలిసి వస్తుందన్న పక్కా ప్రణాళికలతో పట్టిసీమ, తాడిపూడి రెండు ఎత్తిపోతల ద్వారా ప్రజా ప్రతినిధులు, అధికారులు వెంట రాగా ఆర్భాటంగా గోదావరి జలాలను విడుదల చేశారు. తొలుత పట్టిసీమ ఎత్తిపోతల నుంచి కొన్నాళ్ళు ఆగిన తర్వాత తాడిపూడి నుంచి నీటిని విడుదల చేసేవారు. ఈ సారి ఒకేసారి ఒకే తేదీన సాగు నీరందించాలన్న ప్రభుత్వం తన లక్ష్యాన్ని అమలు పరిచింది. పట్టిసీమ నుంచి 8 వేల క్యూసెక్కులు నీటి విడుదలే లక్ష్యంగా విడుదలకు శ్రీకారం చుట్టారు. మరో రెండు, మూడు రోజుల్లో కాల్వల్లో ఆ మేరకు నీటి సామర్థ్యం మేర ప్రవాహం ఉంటుందని ఇంజనీర్లు చెబుతున్నారు. ఇప్పటికే కృష్ణా నదిలో నీరు అతి తక్కువగా ఉండడంతో గోదావరి వరద జలాలు పట్టిసీమ ద్వారా ప్రకాశం బ్యారేజ్‌కు చేరుకోనున్నాయి. ఇది కొస్తా కృష్ణా డెల్టా రైతులకు అతిపెద్ద అదృష్టంగా భావిస్తున్నారు. వాస్తవానికి 2018లో పట్టిసీమ నుంచి సాగునీటి విడుదల ద్వారా కృష్ణా డెల్టాలో అత్యధిక పంట దిగుబడి రికార్డు అయింది. గడిచిన మూడు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంత పంట చేతికి వచ్చి రైతులు ఎగిరి గంతేశారు. ఇదంతా పట్టిసీమ నుంచి వచ్చిన గోదావరి జలాలే కారణమంటూ రైతులు గోదారమ్మకు పూజలు చేశారు.

సంబరమే సంబరం

ఒకేసారి పట్టిసీమ, తాడిపూడి ఎత్తిపోతల నుంచి గోదావరి జలాలు విడుదల కావడంతో ఆయా ప్రాంతాల రైతుల్లో హర్షామోదాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే తొలకరి ఆరంభమైనా రైతులకు సంతృప్తికరంగా సాగు నీరందడం లేదు. పగటి ఉష్ణోగ్రతలు తగ్గకపోవడమే దీనికి ప్రధాన కారణం. ఖరీఫ్ ఈసారి ఆలస్యమైంది. ఈ క్రమంలోనే ప్రకాశం బ్యారేజ్ నుంచి పట్టిసీమ నీరు కృష్ణా డెల్టాకు జీవం పోయనుండటంతో ఆ ప్రాంత రైతుల్లో ఆనందం వెల్లివెరిసింది. ఇటు తాడిపూడి ఎత్తిపోతల పథకం నుంచి ఇన్నాళ్ళలో ఎప్పుడూ లేనంత పట్టిసీమ, తాడిపూడి నుంచి ఒకేసారి నీటి విడుదల సహజంగానే రైతుల్లో ఆనందాన్ని రెట్టింపు చేసింది.

ఇదంతా చంద్రబాబు దయే : నిమ్మల

'సాగునీటి ప్రాజెక్టులకు ప్రాణం పోస్తున్నారు. గతంలో నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టినట్లే అదే పంథాలో ప్రాధాన్యత క్రమంలో సాగునీటి పథకాలు పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఆ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు మరింత చొరవ తీసుకుంటున్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడమే కాకుండా సాగునీటి పథకాలను త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆ క్రమంలోనే రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పట్టిసీమ, తాడిపూడి ఎత్తిపోతల పథకాల ద్వారా నేడు గోదావరి జలాలను విడుదల చేశాం' అని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పట్టిసీమ, తాడిపూడి నుంచి గోదావరి జలాలను విడుదల చేసిన అనంతరం గోదారమ్మకు పూజలు చేసి పూలు, వస్త్రాలు సమర్పించారు. మెట్టను గోదావరి జలాలతో తడపడం ద్వారా వందలాది మంది రైతులకు ఊతమివ్వబోతున్నారని, తద్వారా పట్టిసీమ పథకాన్ని ఇప్పటికే బంగారు పతకంగా మార్చేసిన ఘనత సీఎం చంద్రబాబుదేనని మంత్రి అన్నారు. పట్టిసీమ వద్ద మీడియాతో ఆయన మాట్లాడుతూ.. 'పట్టిసీమ రాష్ట్రానికి బంగారు సీమ. ఈ పథకం ద్వారా 20 టీఎంసీల నీటిని కృష్ణా డెల్టాలోని సాగు, తాగునీటికి వినియోగిస్తున్నారు. ఒకేరోజు పట్టిసీమ, తాడిపూడితోపాటు ఉమ్మడి తూర్పు గోదావరి పరిధిలోని పురుషోత్తపట్నం, పుష్కర ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని విడుదల చేయడం ఓ రికార్డు. తాడిపూడి ద్వారా 875 క్యూసెక్కులు, పురుషోత్తపట్నం ద్వారా 3,500 క్యూసెక్కులు, పుష్కర ఎత్తిపోతల ద్వారా 1200 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి, ఏలేరు రిజర్వాయర్‌లో నీటి నిల్వను పెంచుతాం. ఉత్తరాంధ్రకు సాగు, తాగునీరందేలా చూస్తాం. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు నీరందిస్తాం. పోలవరం ప్రాజెక్టు సమస్యలు త్వరలోనే తీరనున్నాయి' అంటూ తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకటరాజు, పత్సమట్ల ధర్మరాజు, ఐటీడీఏ పీవో సూర్య తేజ, ఇరిగేషన్ ఎస్ఈ నరసింహమూర్తి, రాష్ట్ర సాగు నీటి సంఘాల సమాఖ్య అధ్యక్షుడు వెంకట గోపాల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



పట్టిసీమ ఎత్తిపోతల పథకం నీటిని విడుదల చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, పత్సమట్ల ధర్మరాజు, కలెక్టర్ వెట్రి సెల్వి



విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే పితానికి గజమాల వేస్తున్న అభిమానులు

ధాన్యం బకాయిల సొమ్ము వెయ్యి కోట్లు విడుదల

- రైతుల ఖాతాల్లో జమ : ఎమ్మెల్యే పితాని

పెనుగొండ, జూలై 3 : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన ధాన్యం బకాయిల సొమ్ము రూ.1,000 కోట్లను వారి ఖాతాల్లో జమ చేసినట్టు ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. బుధవారం పెనుగొండ మండలం దొంగరావిపాలెం, సిద్ధాంతం, ఇలపర్రు, ములపర్రు, దేవ, వడలి, పెనుగొండ గ్రామాల్లో ఆయన విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సొమ్ము చెల్లించాలని సీఎం చంద్రబాబును కలిసిన వెంటనే జులై మొదటివారంలో వెయ్యి కోట్లు విడుదల చేస్తామని చెప్పి, ఆ మాటను నిలుపుకున్నారన్నారు. రైతులకు చెల్లించాల్సిన రూ.1,600 కోట్ల మొత్తానికి అప్పటి సీఎం జగన్ రూ.3,200 కోట్లు రుణంగా తీసుకుని ఇతర ఖాతాలకు మళ్లించారని మండిపడ్డారు. సార్వాకు పెట్టుబడి లేక రైతులు అవస్థలు పడుతున్నారని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్ళగా ఈ మొత్తాన్ని మంజూరుచేసి రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్టు చెప్పారు. మాట నిలుపుకున్న వారికి రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. వెలిచేటి బాబూ రాజేంద్రప్రసాద్, కొండవీటి శ్రీనివాసరావు, దొడ్డిపట్ల నాగూర్‌బాబు, సర్పంచ్‌లు నక్కా శ్యామలా సోని శాస్త్రి, చింతపల్లి గనిరాజు, కోన రామలింగేశ్వరరావు, ఉండవల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.



నరసాపురంలో లేసు ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

వరదలపై ముందు జాగ్రత్త

- అధికారులకు కలెక్టర్ నాగరాణి ఆదేశం

నరసాపురం, జూలై 3 : ఏ స్థాయిలో వరదలు వచ్చినా ఏటిగట్టు కోతకు గురి కాకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నాగరాణి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె నరసాపురం పట్టణ, మండలంలో ఆకస్మిక తనిఖీలు చేశారు. కోతకు గురైన వశిష్ఠ ఏటిగట్టును పరిశీలించారు. జరుగుతున్న పనులు, వరదలు వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జిల్లాలోని ఏటి గట్ల పరిస్థితిపై ఆరా తీశారు. అక్కడి నుంచి లేసు పార్కు, ట్రేడ్ సెంటర్‌లకు వెళ్లారు. తయారుచేసిన ఉత్పత్తుల్ని పరిశీలించి, ప్రస్తుత మార్కెట్, శిక్షణ తదితర విషయాలపై అడిగి తెలుసుకున్నారు. లేసు ఎక్స్‌పోర్టర్స్ సంఘం నాయకులు కలకొలను తాతాజీ, తులసీల ఆధ్వర్యంలో ఎగుమతిదారులు కలెక్టర్‌ను కలిశారు. ఈ పరిశ్రమకు పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. పీఎం లంక డిజిటల్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. నిరుద్యోగ యువతకు ఇస్తున్న శిక్షణ, ట్రైనింగ్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఆర్డీవో అంబరీష్, తహసీల్దార్ ప్రసాద్, డీఈ శ్రీనివాస్, ఏఈ సుబ్బారావు పాల్గొన్నారు.

సముద్ర ముఖ ద్వారం తవ్వేందుకు అంచనాలు ఇవ్వండి

మొగల్తూరు, జూలై 3 : పేరుపాలెం సముద్ర ముఖద్వారాన్ని తవ్వి నీటి ప్రవాహం జరిగేలా తగు అంచనాలు రూపొందించాలని కలెక్టర్ నాగరాణి డ్రెయినేజీ శాఖాధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె పేరుపాలెం సముద్ర ముఖద్వారాన్ని పరిశీలించి డ్రెయినేజీ అధికారులతో మాట్లాడారు. తరచూ వర్షాల కారణంగా ఇసుక మేటలు వేయడంతో సముద్రం ముఖ ద్వారం పూడుకుపోతోందని ఫలితంగా ఆయకట్టు పరివాహక ప్రాంతంలో ఆయకట్టు ప్రాంతం ముంపునకు గురవుతోందని అధికారులు ఆమెకు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఎటిమొండి మొగ నుంచి మోళ్ళపర్రు సముద్ర ముఖ ద్వారం వరకూ పూడిక తొలగింపు పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆమె వెంట ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్, డ్రెయినేజీ శాఖ ఈఈ ఎం.వి.వి కిషోర్, డిఈ పి.సుబ్రహ్మణేశ్వరరావు, ఏఈలు దుర్గారావు, రాధిక నరసాపురం, మొగల్తూరు తహశీల్దార్‌లు ప్రసాద్, భాస్కర్ తదితరులున్నారు.

పాలకొల్లు వైసీపీలో విభేదాలు

- ఓటమి పాలైనా కనిపించని మార్పు
- ఒకేరోజు రెండు గ్రూపుల సమావేశాలు
- రెండింటికీ హాజరైన కార్యకర్తలు
- గోపీ వద్దంటూ వ్యతిరేక వర్గం ఆగ్రహం

పాలకొల్లు, జూలై 3 : సార్వత్రిక ఎన్నికలలో పాలకొల్లు నియోజకవర్గంతోపాటు రాష్ట్రమంతటా ఘోర పరాజయం పొందిన వైసీపీ నాయకుల్లో మార్పు రావడం లేదు. ఇందుకు ఉదాహరణ పాలకొల్లులో ఆ పార్టీ నాయకుల వ్యవహార శైలే కారణం. ఈ నెల 8న దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించడానికి బుధవారం తాము సమావేశం ఏర్పాటు చేసుకోగా, అది తెలిసిన గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అప్పటికప్పుడు తన కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసుకున్నారని ఆయన ప్రత్యర్థి వర్గీయులు ఆరోపిస్తున్నారు. గోపీ మాట్లాడుతూ తమ పార్టీ పరాజయం పాలైనా కార్యకర్తలు నిరాశ చెందకుండా ధైర్యంగా ఉండాలని పార్టీకి అధిక శాతం ఓట్లు వచ్చాయని రానున్న రోజుల్లో ప్రజలు వైసీపీని ఆదరిస్తారని చెప్పుకొచ్చారు. పార్టీ నాయకులు చేగొండి ప్రకాష్, తాతాజీ, కర్రా జయసరిత, తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం లయన్స్ కమ్యూనిటీ హాల్లో జరిగిన నియోజకవర్గ వైసీపీ సమావేశంలో ఆ పార్టీ నాయకులు గుణ్ణం నాగబాబు, మేకా శేషుబాబు, నడపన గోవిందరాజులు నాయుడు, ముచ్చర్ల శ్రీరామ్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. విశేషం ఏమిటంటే ఉదయం గోపి నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న పలువురు సాయంత్రం జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. శేషుబాబు, నాగబాబు మాట్లాడుతూ తమకు ఎవరికీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పదవి వద్దని, వచ్చే ఎన్నికల్లో సైతం తమకు టికెట్ వద్దని తేల్చి చెప్పారు. టికెట్ ఎవరికి ఇచ్చిన గెలుపుకోసం ప్రయత్నిస్తామని, గోపిని తప్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలు తమ పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకు వెళతామని చెప్పారు. గోపి తప్పిదాల వల్లే పాలకొల్లులో వైసీపీ ఓటమి పాలయ్యిందని చెప్పారు. ఇలా రెండు వర్గాల సమావేశాలతో మళ్లీ వర్గ విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

ఆక్వా క్రాప్ హాలిడేకి సిద్ధం

ఏళ్ల తరబడి నష్టాల ఊబిలో రొయ్యల రైతులు

- కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని పాలకొల్లు మహాసభ వినతి

పాలకొల్లు రూరల్, జూలై 3 : 'ఆక్వా రైతులు నిండా కష్టాల్లో ఉన్నారు. ఈ రంగం కుదేలు కావడానికి గత ప్రభుత్వ విధానాలే కారణం. వీటిని కూటమి ప్రభుత్వమే గట్టెక్కించాలి. లేకుంటే రైతులకు క్రాప్ హాలిడే మినహా మరో మార్గం లేదు' అని ఆక్వా రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం పాలకొల్లులో జరిగిన ఆక్వా రైతుల రాష్ట్రస్థాయి మహాసభలో అధ్యక్షుడు గొట్టిముక్కల గాంధీ భగవాన్‌రాజు అధ్యక్షత వహించి మాట్లాడారు. 'రొయ్యల రేట్లను ప్రాసెసింగ్ కంపెనీలే నిర్ణయిస్తున్నాయి. సీడ్ కంపెనీలు ప్రమాణాలు పాటించడం లేదు. ఐదేళ్ళుగా ఆక్వా సాగు అనేక ఒడిదుడుకుల్లో ఉన్నప్పటికి ప్రభుత్వపరంగా ప్రోత్సాహం లేదు. సీడ్ కంపెనీలు నాణ్యమైన ప్రమాణాలు పాటించకపోవడంతో నాశి రకం సీడ్ తెచ్చుకుని రైతులు నష్టపోతున్నారు. ముడి సరుకు ధరలు తగ్గినప్పటికి సీడ్ కంపెనీలు ఇష్టానుసారం ధరలు పెంచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణం నెరవేర్చాలన్నారు. ఎన్ఎఫ్‌డీపీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే సబ్సిడీలు రైతులకందేలా కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు. పాలకొల్లు వేదికగా ఎన్నికల మహా సభలో సీఎం చంద్రబాబు రొయ్య రైతులను ఆదుకుంటామని ఇచ్చిన హామీలపై రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్ర జల వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈ అంశంపై దృష్టి పెట్టాలన్నారు. ఆక్వా రైతులు కలిసికట్టుగా సాగు చేస్తేనే ప్రస్తుత నష్టాలను ఎదుర్కోగలుగుతామని పలువురు వక్తలు సూచించారు. ఆక్వా సాగు జూదంగా మారిందని గత దశాబ్ద కాలంతో పోలిస్తే పెట్టుబడి వ్యయం మూడింతలు పెరగ్గా ఆదాయం ఐదు నుంచి రెండింతలకు పడిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆక్వా ఉనికి కోల్పోయే ప్రమాదం ఉన్నందున తక్షణం ప్రభుత్వపరంగా ఆదుకోవడం, కంపెనీల నియంత్రణ ధోరణిని అరికట్టి ఫీడ్ ధరలను స్థిరీకరించడం, నాశిరకం సీడ్ అమ్మకాలు జరుపుతున్న హేచరీలపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా ఈ రంగానికి పూర్వ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సభలో రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. సభకు ముందు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో ఆక్వా రైతు సంఘం నూతన కమిటీని త్వరలో ఎన్నుకునేందుకు సమావేశం తీర్మానించింది. కార్యదర్శి బోణం వెంకట నరస్సయ్య(చినబాబు) తదితరులు పాల్గొన్నారు.



ఆక్వా రైతు మహాసభలో మాట్లాడుతున్న గాంధీ భగవాన్‌రాజు

పండుగప్ప పతనం

- కిలో రూ.500 నుంచి రూ.370కి
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు

మండవల్లి, జూలై 3: చేపల సాగులో రారాజు పండుగప్ప కాస్తా చతికిలబడింది. గిట్టుబాటు కాక రైతులు లబోదిబోమంటున్నారు. ఆక్వాలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక వైపు విద్యుత్ చార్జీలు పెంపు, మరోవైపు మార్కెట్ స్థిరత్వం లేకుండా తగ్గుదలతో ధర క్షీణించింది. వనామి రొయ్యల సాగులో వైట్‌కట్ వైరస్ వంటి వ్యాధులు వ్యాపించి రైతాంగానికి తేరుకోలేని దెబ్బ తీయడంతో ఊహించని రీతిలో నష్టాలు బాటలో పడి అప్పుల పాలైపోయారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ఫంగస్, తెల్లచేప, రూప్‌చంద్ వంటి చేపల జాతుల పెంపకానికి శ్రీకారం చుట్టినా ఆశించిన లాభాలు రాకపోవడంతో పండుగప్ప వైపు మక్కువ చూపారు. పండుగప్ప సాగు 18 నెలలు నుంచి పైబడి సాగు చేయాల్సి ఉన్నా, అధిక ఖర్చు అవుతున్నప్పటికీ లాభాలు ఘనంగా ఉంటాయన్న ఆశతో వనామి రైతులు పండుగప్ప వైపు చూశారు. 18 నెలలు నుంచి పైబడి సాగు చేసిన రైతులు ప్రస్తుతం నెలకొన్న మార్కెట్ ధరను చూసి దిగాలు చెందుతున్నారు. పండుగప్ప పెంపకానికి తయారీ చేసే మేతతో పనిలేకుండా మేతగా బతికి ఉన్న చైనా గురకచేపలు వేయాలి. దీని కోసం రైతులు పడినకష్టం మాటల్లో చెప్పలేం. గతంలో చైనా గురక కిలో పది నుంచి 15 మాత్రమే ఉండేది. కొన్నిచోట్ల ఉచితంగా గురకను తీసుకుని పొమ్మని రైతులు కోరేవారు. పండుగప్ప పుణ్యమా అంటూ దాని ధర ప్రస్తుతం కిలో రూ.40 నుంచి రూ.50 పలకడంతో ఖర్చు భారీగా పెరిగింది. ఈ పండు గప్ప వ్యాధులు బారిన పడే ప్రమాదం లేకపోయినా ఆక్సిజన్ సమస్య కత్తిమీద సాములా ఉంటుంది. దీనికోసం విద్యుత్ మోటర్లు, ఇంజన్లు వంటివి ఏర్పాటు చేసి రేడియేటర్స్ ఆక్సిజన్ కోసం తిప్పాల్సి ఉంటుంది. ఆయిల్ ఖర్చు, విద్యుత్ బిల్లు భారీగా పెరిగాయని రైతులు వాపోతున్నారు. గత నెల 15వ తేదీన రూ.430 పలికిన పండుగప్ప ప్రస్తుతం మార్కెట్లో కిలో రూ.370లకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, దళారులు సిండికేట్‌గా మారి రైతులకు గిట్టుబాటు కాని ధరను ప్రకటించి మాయ చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి ఏపీఈఏపీసెట్ సర్టిఫికెట్ల పరిశీలన -5లో

అమ్మ చెంతకు..

- ఎనిమిది నెలల క్రితం అదృశ్యమైన యువతి.. తీసుకు వెళ్లిన వ్యక్తి కోసం పోలీసుల గాలింపు
- జమ్మూ కాశ్మీర్ నుంచి అమెజాన్‌లో వస్తువులు ఆర్డర్ ఇవ్వడంతో గుర్తింపు
- యువతిని రక్షించి జంగారెడ్డిగూడెంలో తల్లికి అప్పగింత - 5లో

సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చిన జగన్ సర్కార్

- రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్‌పర్సన్ ఎదుట పలువురి ఆవేదన -5లో

ఉద్యాన వర్సిటీలో కరెంటు కష్టాలు



మంచినీళ్లు రాక విద్యార్థుల ఇబ్బందులు.. పట్టించుకోని అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 3 : వెంకట్రామన్నగూడెం ఉద్యాన వర్సిటీకి నెల రోజులుగా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయాలు ఏర్పడుతున్నాయి. దీనిపై విద్యార్థులు వార్డెన్, విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. ఫలితంగా బాలు రు, బాలికల వసతి గృహాలతోపాటు, క్వార్టర్స్‌లోని ఉద్యోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. మంగళవారం రాత్రి అర్ధరాత్రి ఒంటి గంట నుంచి కరెంటు లేకపోవడంతో విద్యార్థులు జాగారం తప్పలేదు. ఇంటర్నల్ పరీక్షలు రాయాల్సి ఉన్నా ఒక పక్క నిద్ర మరో పక్క చదువుకునేందుకు వెలుతురు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కరెంటు లేకపోవడంతో విద్యార్థుల వ్యక్తిగత అవసరాలకు కూడా నీరు సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. అలాగే తాగేందుకు, వంటకాలకు మంచి నీరందక ఉదయం టిఫిన్ వండడంలో జాప్యం జరుగుతోంది. ఈ కారణంగా చాలా మంది టిఫిన్ తినకుండానే క్లాసులకు వెళ్లడంతో ఆకలితో పాఠాలు వినాల్సి వస్తోందని వారు ఆవేదన చెందుతున్నారు. విద్యుత్ సమస్య ఎదురైనప్పుడు అత్యవసరంగా వినియోగించేందుకు ఏర్పాటు చేసిన జనరేటర్లు మరమ్మతులతో షెడ్‌కే పరిమితమయ్యాయి. ఇవి పాడయ్యాయని ఒక అధికారి చెబుతుంటే.. డీజిల్‌కు ఇండెంట్ పెట్టామంటూ మరో అధికారి అంటున్నారు. దీనిపై వారిలో వారికే స్పష్టత లేకపోవడం విడ్డూరమని విద్యార్థులు వాపోతున్నారు. వర్సిటీ నిర్వహణ అధ్వాన్నంగా ఉందని ఇప్పటికే ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైనా అధికారుల్లో ఎలాంటి చలనం లేదు. ఇప్పటికీ నిర్వహణ అదే మాదిరి ఉండటం చర్చనీయాంశమైంది.



సమస్య పరిష్కరిస్తాం..

ఈ సమస్యపై సంబంధితన వర్సిటీ ఏఈ పట్నాల సతీష్‌ను వివరణ కోరగా.. 'వర్సిటీకి వచ్చే లైన్ ఇబ్బంది ఉందని విద్యుత్తు శాఖ అధికారులకు తెలియజేశాం. బయట ఫీడర్ వద్ద సమస్య ఉందని గుర్తించి పరిష్కరించారు. కానీ వర్సిటీ ప్రాంగణంలోనే మరో సమస్య తలెత్తింది. దాన్ని పరిష్కరించి రెండు రోజుల్లో విద్యుత్ సమస్య లేకుండా చూస్తాం' అని తెలిపారు.

నేటి నుంచి ఏపీ ఈఏపీసెట్ సర్టిఫికెట్ల పరిశీలన



7వరకూ కొనసాగనున్న ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

8 నుంచి 12 వరకూ వెబ్ ఆప్షన్ల నమోదు

జేఎన్టీయూకే, జూలై 3: ఏపీ ఈఏపీసెట్- 2024 అడ్మిషన్లకు ఎంపీసీ విభాగం అభ్యర్థులకు సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ ఈనెల 4 నుంచి జరుగనుంది. ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభ మైంది. దీని ద్వారా ఇంజనీరింగ్ కళాశాలల్లోని సీట్లను భర్తీ చేయనున్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఏపీ ఈఏపీసెట్ అడ్మిషన్స్ కన్వీనర్ ఆదివారం జారీచేశారు. ఈనెల 7వరకూ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపుచేసుకోవచ్చని కాకినాడ జేఎన్టీయూకేలోని యూసీఈకే సహాయ కేంద్రం సమన్వయకర్త ప్రొఫెసర్ ఎన్.బాలాజీ తెలిపారు.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఇలా

అభ్యర్థులు మొదటిగా https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి అడ్మిషన్లపై క్లిక్ చేయాలి అనంతరం వచ్చిన ఫారంలో హాల్ టికెట్ నెంబరు, పుట్టిన తేదీ నమోదు చేస్తే రిజిస్ట్రేషన్ ఫారం వస్తుంది. అందులో అడిగిన సమాచారం క్షుణ్ణంగా నింపి సబ్‌మిట్ చేయాలి. అనంతరం పది, ఇంటర్ మార్కుల జాబితాలు, 6 నుంచి ఇంటర్ వరకూ స్టడీ, టీసీ, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, ర్యాంకు కార్డు, రేషన్ కార్డు, హాల్ టికెట్లను అప్‌లోడ్ చేయాలి. ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రం ఉన్న వారికి 2022 నుంచి 10 శాతం రిజర్వేషన్‌ను ప్రతీ ఏడాది అమలు చేస్తున్నారు.

షెడ్యూల్ ఇదే

ఈ నెల 7 వరకూ ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్
4 నుంచి 10 వరకూ ధ్రువపత్రాల పరిశీలన
8 నుంచి 12 వరకూ వెబ్ ఆప్షన్ల నమోదు
13న ఆప్షన్ల మార్పు, 16న సీట్ల కేటాయింపు
17 నుంచి 22 వరకూ కళాశాలల్లో రిపోర్టింగ్
19 నుంచి తరగతుల ప్రారంభం

ఇవి సిద్ధం చేసుకోండి

ర్యాంకు కార్డు, మార్కుల జాబితా, హాల్ టికెట్, పుట్టినరోజు, టీసీ, స్టడీ ధ్రువపత్రం, ఈడబ్ల్యూఎస్, నివాస, కులధ్రువీకరణ, ఆదాయ, స్థానికత ధ్రువపత్రాలను విద్యార్థులు సిద్ధం చేసుకోవాలి. పీహెచ్, క్యాప్, ఎన్‌సీసీ, స్కౌట్స్, గైడ్స్, స్పోర్ట్స్, గేమ్స్, ఆంగ్లో ఇండియన్ కేటగిరీ అభ్యర్థులకు మాత్రం ఈనెల 6 నుంచి విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించనున్నారు.

ట్రిపుల్ ఐటీలో ప్రత్యేక కేటగిరీలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్

నూజివీడు టౌన్,జూలై 3: నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ప్రత్యేక కేటగిరి విద్యార్థులకు మూడోరోజు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ర్వహించారు. ఆర్జీయూకేటీ అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్రకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సైనిక సంతతి విభాగానికి చెందిన 57 మంది, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో 49,ఎన్‌సీసీ విభాగంలో 101 మంది, క్రీడా విభాగంలో 180, దివ్యాంగుల విభాగంలో 248 మంది మొత్తం 579 విద్యార్థులు వెరిఫికేషన్‌లో పాల్గొన్నారు.

డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్లకు డీఎన్నార్‌లో హెల్ప్ సెంటర్

భీమవరం ఎడ్యుకేషన్, జూలై 3: 2024-25 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ పద్ధతిలో డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు సహకరించేందుకు హెల్ప్‌లైన్ సెంటర్ డీఎన్నార్ కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు నరసింహరాజు ప్రారంభించారు. బీఏ, బీకాం, బీఎస్సీలలో ప్రవేశం కోరే విద్యార్థులు డీఎన్నార్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటర్‌కు వచ్చి తమ పేర్లను ఈనెల 10వ తేదీలోగా రిజిస్టరు చేయించుకోవాలని ఆ తరువాత 11వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ తాము కోరుకున్న కోర్సులకు వెబ్ ఆప్షన్‌లు పెట్టుకోవాలని, వారికి సీట్లు కేటాయింపు ఈనెల 19వ తేదీన జరుగుతుందని తెలియజేశారు.

మొగల్తూరులో మైనింగ్ అధికారుల తనిఖీలు



మొగల్తూరు, జూలై 3: మొగల్తూరు పంచాయతీ పరిధిలో ఇసుక తవ్వకాలు, అక్రమ లేఅవుట్‌లను బుధవారం జిల్లా మైనింగ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మైనింగ్ శాఖ టీఏ బాబూరావు, సిబ్బంది, వీఆర్వో సుభాషిణిలు ఇటీవల వేసిన లేఅవుట్‌లు, స్థలాల పూడికలను పరిశీలించారు. మైనింగ్ శాఖ అనుమతి లేకుండా ఇసుక తవ్వకాలు చేసి స్థలాలు పూడికలు చేశారని భారీ లోతున ఇసుక తవ్వారని వచ్చిన ఫిర్యాదుల మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. లేఅవుట్‌లు వేసిన భూ యజమానులకు నోటీసులు ఇవ్వనున్నట్టు అధికారులు తెలిపారు.

పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

పోలవరం జూలై 3 : పోలవరంలో గోదావరి నీటిమట్టం పెరుగుతూ వస్తుంది బుధవారం ఉదయం నాటికి నీటిమట్టం పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు, కొండవాగుల నీటి జలాలతో ఉపనదుల జలాలతో నీటిమట్టం పెరుగుతూ వస్తుంది. స్పిల్వే ఎగువన 26.470 మీటర్లు, స్పిల్వే దిగువన 16.530 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యాంకి ఎగువన 26.520 మీటర్లు, దిగువ కాఫర్ డ్యాంకి దిగువన 15.360 మీటర్ల నీటిమట్టం నమోదైనట్టు ఈఈ వెంకటరమణ తెలిపారు. గండి పోశమ్మ అమ్మవారి ఆలయం వద్ద నీటిమట్టం రెండు అడుగులు మేర పెరిగింది.

పోలవరం ఏజెన్సీలో చిరుత సంచారం



మృతి చెందిన మేకను పరిశీలిస్తున్న అధికారులు

పోలవరం జూలై 3 : పోలవరం ఏజెన్సీలో చిరుత సంచారం,మేకలపై దాడితో గిరిజనులు భయపడుతున్నారు. పోలవరం మండలం వింజరం పంచాయతీ సున్నాలగండి గ్రామ సమీపంలో మడకం పుల్లారావుకు చెందిన మేకపై మంగళవారం రాత్రి చిరుత దాడి చేసి చంపినట్టు అటవీ క్షేత్రాధికారి దావీదురాజు తెలిపారు. బాధితుడు పుల్లారావు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా ప్రాంతానికి వెళ్ళి పశు వైద్యాధికారితో పరీక్షలు నిర్వహించి ఆ ప్రాంతంలో చిరుత పాదముద్రలు సేకరించామన్నారు. సమీప గ్రామాల్లో చిరుత సంచారంపై అటవీశాఖ సిబ్బందితో అవగాహన కల్పించినట్టు తెలిపారు. ఒంటరిగా అడవుల్లోకి వెళ్ళరాదని పశువులను అడ వుల్లో మేపరాదని, పంట పొలాల్లో వంగి పనులు చేసేటప్పుడు మరొకరు పరిస రాలు గమనిస్తూ ఉండాలని సూచించారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో రాగివైర్ల చోరీ



జీలుగుమిల్లి, జూలై 3 : జీలుగుమిల్లి సమీప గ్రామాల్లో రైతుల పొలాల్లో వ్యవ సాయ బోర్ల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైర్లను చోరీ చేస్తున్నారు. మంగళవారం రాత్రి రైతు రేపాక రాజేష్ పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగివైర్లు చోరీ చేశారు. పది రోజుల్లో ఇది నాల్గో చోరీగా రైతులు చెబుతున్నారు. కొద్ది రోజుల క్రితం బర్రింకలపాడు, గత ఆదివారం దర్భగూడెం, పి.రాజవరంలో ఇదే క్రమంలో వరుస చోరీలకు పాల్పడ్డారు.మంగళవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌ల దొంగలు రైతులకు పోలీస్‌లకు సవాలు విసురుతున్నారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా చొరవ చూపడం లేదంటున్నారు.దీంతో రాత్రి వేళ విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌ల దొంగల ఆగడాలు హెచ్చు మీరుతున్నాయి. విద్యుత్ సిబ్బంది మాత్రం ఎవరిమీదైనా అనుమానం ఉంటే తెలియజేయాలని రైతుల్ని కోరారు.

అమెజాన్ ఆర్డరే పట్టించింది..!

ఎనిమిది నెలల క్రితం యువతి అదృశ్యం కేసు

యువతిని తీసుకెళ్లిన వ్యక్తి కోసం గాలింపు

జమ్మూకశ్మీర్‌లో ఆన్‌లైన్ ఆర్డర్..ట్రాక్ చేసి పట్టుకున్నారు

జంగారెడ్డిగూడెంలో తల్లికి అప్పగించిన పోలీసులు

విజయవాడ, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : ఎనిమిది నెలల కిందట అదృశ్యమైన యువతిని ఓ అమెజాన్ ఆన్‌లైన్ ఆర్డర్ పట్టించింది. ఒక యువకుడితో జమ్మూకశ్మీర్‌లో ఉన్నట్టు గుర్తించిన పోలీసులు ఆమెను మంగళవారం అర్ధరాత్రి విజయవాడకు తీసుకొచ్చారు. మాచవరం పోలీసులు బుధవారం ఆ యువతిని పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడేనికి చెందిన తల్లికి అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. విజయవాడలో హోటల్ మేనేజ్‌మెంట్ చదువుతున్న తన కుమార్తె కనిపించడం లేదని తల్లి గతంలో మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా స్పందించడంతో దర్యాప్తులో వేగం పెంచారు.

దక్షిణాది టు ఉత్తరాది..

గత నవంబరులో అంజాద్ అలియాస్ షణ్ను అనే యువకుడు ఆ యువతిని తీసుకుని వెళ్లిపోయాడు. తొలుత పోలీసులు హైదరాబాద్‌లో ఉన్నట్టు గుర్తించినా ఫలితం లేకపోయింది.పోలీసులు ట్రాక్ చేస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న అంజాద్ తనతో పాటు యువతి ఫోన్‌ను అమ్మేశాడు. అక్కడ మిస్సయిన ఈ ఇద్దరూ కలిసి దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాలను చుట్టుముట్టేశారు. హైదరాబాద్ నుంచి రైల్లో బెంగళూరు వెళ్లారు. అక్కడి నుంచి కేరళకు చేరుకున్నారు. అక్కడి నుంచి రాజస్థాన్ వెళ్లారు. బెంగళూరులో స్నేహితుల వద్ద వారం పాటు ఉన్నారు. అక్కడి నుంచి కేరళ వెళ్లి తర్వాత రాజస్థాన్‌కు వెళ్లారు. అక్కడి నుంచి జమ్మూకశ్మీర్‌కు వెళ్లారు. ఈ ప్రయాణాలన్నీ రైల్లోనే చేశారు. ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లినా టికెట్ కొనకుండా జనరల్ బోగీల్లో ప్రయాణించారు. జమ్మూకశ్మీర్ వెళ్లాక అంజాద్ అక్కడ సెకండ్ హ్యాండ్ ఫోన్ కొన్నాడు. అందులో సిమ్‌కార్డు వేసి బెంగళూరులో ఉన్న స్నేహితులతో మాట్లాడటం మొదలుపెట్టాడు.ఈ వివరాలను గుర్తించిన పోలీసులు బెంగళూరుకు వెళ్లి వారిని విచారణ చేయగా, అక్కడికి వచ్చి వెళ్లిపోయారని తెలుసుకున్నారు.అంజాద్ తన ఆధార్‌కార్డు నెంబర్‌ను ఉపయోగించి అమెజాన్‌లో ఆన్‌లైన్ ఆర్డర్ ఇచ్చాడు. దీన్ని సైబర్ క్రైం పోలీసులు ట్రాక్ చేశారు. ఈ లొకేషన్‌ను అక్కడి పోలీసులకు షేర్ చేసి అసలు విషయాన్ని వివరించారు. జమ్మూకశ్మీర్ పోలీసులు అంజాద్‌తో పాటు యువతిని అదుపులోకి తీసుకున్నారు.అక్కడి నుంచి మాచవరం పోలీసులు యువతిని తీసుకువచ్చి క్షేమంగా తల్లి చెంతకు చేర్చారు. అంజాద్‌పై ఆమె తల్లి మరో ఫిర్యాదు చేయనుంది. ప్రస్తుతం అంజాద్ పోలీసుల అదుపులో ఉన్నాడు.

పింఛన్ సొమ్ము పక్కదారి

రికవరీ చేసి లబ్ధిదారులకు అందించిన అధికారులు

ద్వారకా తిరుమల, జూలై 3: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల సొమ్ము స్వాహా చేసినట్లు ఆరోపణలు రావడంతో విచారణకు వచ్చిన అధికారులకు బంగారం తాకట్టు పెట్టి ఆ సొమ్ము ఇచ్చిన ఘటన మండలంలోని పంగిడిగూడెంలో చోటు చేసుకుంది. పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తానని చెప్పి వీఆర్వో చంద్రలీల పూర్తిస్థాయిలో ఇవ్వలేదని లబ్ధిదారులు లబోదిబోమనడంతో అధికారులు రంగంలోకి దిగారు. ఎంపీడీవో తిరుపతిరావు, డిప్యూటీ తహసీల్దారు దుర్గామహాలక్ష్మిలు వెళ్లి సొమ్ము రికవరీ చేసి మిగిలిన 13 మందికి పింఛన్లను అందజేశారు. పంగిడిగూడెంలో 56 మంది లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేసేందుకు వీఆర్వో చంద్రలీల సొమ్ము తీసుకున్నారు. తొలిరోజున 39 మందికి ఆమె పింఛన్ అందించారు. మరుసటి రోజు మరో నలుగురికి అందించారు. మిగిలిన 13 మంది తమకు పింఛను అందలేదని అధికారులకు చెప్పడంతో డీటీ దుర్గామహలక్ష్మి పంగిడిగూడెం వెళ్లి వీఆర్వో, లబ్ధిదారులతో మాట్లాడారు. తనవద్ద ప్రస్తుతం డబ్బులేదని బుధవారం అందిస్తానని చెప్పగా కుదరదని లబ్ధిదారులకు ఇవ్వాలని డీటీ చెప్పడంతో వీఆర్వో సహాయకుడిగా పని చేస్తున్న వెంకటేశ్వర రావు బంగారం తాకట్టు పెట్టి రూ.91 వేలు సొమ్ము అధికారులకు ఇచ్చారు. దానిని 13 మంది లబ్ధిదారులకు అందించారు. దీనిపై ఎంపీడీవో తిరుపతిరావు మాట్లాడుతూ వీఆర్వోకు ఫోన్ చేయగా తాను ఆసుపత్రిలో ఉన్నానని ఆరోగ్యం బాగోక పోవడంతో మరుసటి రోజు పంపిణీ చేద్దామని అను కున్నానని చెప్పారన్నారు. ఈ విషయం డీటీతో చెప్పగా ఆ మధ్యాహ్నం ఆమె వెళ్లి మొత్తం సొమ్ము రికవరీ చేసి లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారన్నారు.

వందేభారత్‌కు ఏలూరులో హాల్ట్ ఇవ్వాలి



రైల్వేబోర్డు చైర్మన్ జయవర్మ సిన్హాను కలిసిన ఎంపీ మహేష్

ఏలూరు టూటౌన్, జూన్ 3: వందే భారత్ ట్రైన్‌కు ఏలూరు స్టేషన్‌లో హాల్ట్ ఇవ్వాలని రైల్వే బోర్డు ఛైర్మన్, సీఈవో జయవర్మ సిన్హాను బుధవారం ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ ఢిల్లీలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రజల చిరకాల స్వప్నమైన భద్రాచలం-కొవ్వూరు రైల్వే లైన్ మంజూరు చేయాలని కోరానన్నారు. సానుకూలంగా స్పందించిన జయవర్మ సిన్హా త్వరలోనే పనులు పూర్తయేలా చూస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. అలాగే జిల్లాలోని టొబాకో రైతులు ఎదుర్కుంటున్న సమస్యలు పరిష్కరించాలని మినిస్ట్రీస్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ సునీల్ వర్త్వల్‌ను కలిసి వినతిపత్రం సమర్పించినట్టు తెలిపారు. వర్జీనియా పొగాకును ఇతర దేశాలకు అదనంగా ఎగుమతి చేసుకు నేందుకు రైతులకు అవకాశం ఇవ్వాలన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పోలవరం, జూలై 3 : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్ర గాయాలపాలైన సంఘటన పోలవరం మండలం ప్రగడపల్లి పంచాయతీ శివారున బుధవారం మధ్యాహ్నం జరిగింది. పోలవరం ఎస్‌ఐ పవన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం వింజరం పంచాయతీ వెంటకరెడ్డిగూడెం గ్రామానికి చెందిన కారం సురేష్ దొర (28),కొమరం రాంప్రసాద్ దొండపూడి వైపు వెళ్తూ ఎదురుగా వస్తున్న ప్రైవేటు స్కూలు బస్సుని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలవడంతో అదే బస్సులో పోలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో సురేష్‌దొర మృతి చెందాడు. మరొక యువకుడు రాంప్రసాద్ చికిత్స పొందుతున్నాడు. కేసుని గోపాలపురం పోలీస్ స్టేషన్‌కి బదలాయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు నుంచి జారిపడి ఒకరి మృతి

తణుకు, జూలై 3 : ఉండ్రాజవరం మండలం కాల్దరి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందాడు. తణుకు రైల్వే అవుట్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. మృతుడు నిడదవోలు నుంచి వేంద్ర వరకు టికెట్ తీసుకున్నాడని, సుమారు అరవై సంవత్సరాల వయసు ఉంటుందని రైల్వే పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో ఎస్‌ఐ మృతి



భీమవరం క్రైం, జూలై 3: రాత్రిపూట గస్తీ తిరిగి తెల్లవారుజామున ఇంటికి వెళ్లిన ఎస్‌ఐ గుండెపోటుతో మృతి చెందారు. ప్రభుత్వాసుపత్రి సిబ్బంది తెలిపిన వివరాలు ప్రకారం విజయవాడ సింగ్‌నగర్‌కు చెందిన నాగేశ్వరరావు (61) ఎన్నికల ముందు విజయవాడ నుంచి భీమవరం ఎస్‌ఐగా బదిలీపై వచ్చారు. అయితే మంగళవారం రాత్రి గస్తీ తిరిగి తెల్లవారుజామున తన సొంత కారులో ఇంటికి వెళ్లారు. తను ఉంటున్న అపార్ట్‌మెంట్ కింద కారు పార్క్ చేసి కారులోనే గుండెపోటుతో మరణించారు. ఉదయం కుటుంబ సభ్యులు చూసేసరికి మరణించి ఉండటాన్ని గమనించారు. సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) భీమారావు, సీఐలు, ఎస్‌ఐలు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చెరువుకు గండి..కొట్టుకుపోయిన చేపపిల్లలు

మొగల్తూరు,జూలై 3: సరిహద్దు రైతు లోతుగా చెరువు తవ్వడంతో తాను సాగు చేసే చెరువు గట్టు గండిపడి అందులో గల చేపపిల్లలు కొట్టుకుపోయాయని మొగల్తూరు కోట ప్రాంతానికి చెందిన చెరువు లీజు రైతు మాదిరెడ్డి బాలాజీ వాపోయారు. 2 ఎకరాలు లీజుకు తీసుకుని చేపల చెరువు సాగు చేసుకుంటున్నానని ఇటీవల తన సమీపంలోని రైతు ఇసుక అమ్ముకోవడం కోసం భారీ లోతు తవ్వడంతో తన చెరువుకు గండి పడి చెరువులో గల రూ.8 లక్షలు విలువ గల చేపపిల్లలు సరిహద్దు చెరువు, బోదెలోకి కొట్టుకుపోయాయన్నారు.



కల్కి కారులో ఆర్‌ఆర్‌ఆర్

ప్రభాస్ నటించిన కల్కి 2898 ఏడీ సినిమాలో వినియోగించిన కారు భీమవరంలోని మల్టీఫ్లెక్స్ థియేటర్ ఆవరణలో సందడి చేస్తోంది. మంగళవారం రాత్రి ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు ఈ బుజ్జి కారులోకి ఎమ్మెల్యే ఎక్కి సందడి చేశారు అభిమానులు, నాయకులు ఎమ్మెల్యేతో కారు వద్ద సెల్ఫీలు దిగారు. -ఉండి



ఆడిట్ ఉద్యోగుల నూతన కార్యవర్గం

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

ఏలూరు రూరల్, జూలై 3: ఉద్యోగుల ఐక్యతతోనే సమస్యలు పరిష్కారమవుతాయని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ అన్నారు. ఏలూరు కలెక్టరేట్ ఆవరణల ఏపీ ఎన్జీవో స్టేట్ ఆడిట్ అసోసియేషన్ ఏలూరు జిల్లాశాఖ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డీఎస్ఎస్ గణేష్, ప్రధాన కార్యదర్శిగా బి.లక్ష్మీపతి, ఉపాధ్యక్షుడిగా వై.జయప్రకాష్, శరత్‌బాబు, ఎమ్డీ ఖాజావలీ, కోశాధికారిగా వై.సీతారామ్, సంయుక్త కార్యదర్శులుగా ఎన్.శ్రీనివాస్, శ్రీనివాస్ ఎన్నిక య్యారు. సహాయ ఆడిట్ అధికారిగా జ్యోతి, సీనియర్ ఆడిటర్‌గా పి.రాజేంద్ర ఎన్నికయ్యారు. ఏపీఎన్జీవో జిల్లా ప్రధాన కార్యదర్శి నెరుసు రామారావు మాట్లాడుతూ ఆడిట్ ఉద్యోగులకు అన్ని విధాలుగా ఏపీ ఎన్జీవో అండగా ఉంటుందన్నారు. నూతన అధ్యక్షుడు గణేష్ మాట్లాడుతూ ఆడిట్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బలమైన నాయకత్వం అవసరమన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను సత్కరించారు. జోన్-2 ఉప సంచాలకులు చినపరెడ్డిని కార్యవర్గ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, జూలై 3 : జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పుర స్కారం-2024లకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల టీచర్ల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈనెల 15లోగా చేసుకోవాలని, తదుపరి జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా రాష్ట్రస్థాయి సెలక్షన్ కమిటీకి ఈ నెల 25లోగా పంపించాలని కోరారు. స్టేట్ సెలక్షన్ కమిటీ ద్వారా షార్ట్ లిస్టు చేసిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఆగస్టు నాలుగో తేదీలోగా ఇండిపెండెంట్ నేషనల్ జ్యూరీకి పంపిస్తామన్నారు. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ షార్ట్ లిస్టు చేసిన ఉపాధ్యాయుల వివరాలను ఆగస్టు 5,6 తేదీల్లో వెబ్‌సైట్‌లో పొందుపరుస్తుందని వివరించారు. వ్యక్తిగత ముఖాముఖీలను వీడియో కాన్ఫరెన్స్ లేదా వ్యక్తి గతంగా ఆగస్టు 7 నుంచి 12 వరకు జ్యూరీ నిర్వహిస్తుందన్నారు. పురస్కారాలకు ఎంపికైన టీచర్ల వివరాలను ఆగస్టు 13న వెబ్‌సైట్‌లో ఉంచుతారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్‌పర్సన్ రత్నకుమారి

వైసీపీ ప్రభుత్వం సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చింది

రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్‌పర్సన్ ఎదుట సర్పంచ్‌ల ఆవేదన



ఆవేదన వ్యక్తం చేస్తున్న సర్పంచ్

ఏలూరు రూరల్, జూలై 3: "గ్రామానికి మొదటి వ్యక్తి సర్పంచ్. సర్పంచ్‌గా ఎన్నికైన నాటి నుంచి నిధుల లేమితో కొట్టుమిట్టాడాం. పదవి ఉన్నా పవర్ లేని నేతగా కాలం ఈడ్చుకువచ్చాం... నిధుల విషయంలో ఎవరికి చెప్పుకోలేని దుర్భర పరిస్థితిని అనుభవించాం. ఎంపీడీవో, సచివాలయ సిబ్బంది సైతం అవమాన పరిచేలా మాట్లాడారు. వైసీపీ పాలనలో గ్రామస్వరాజ్యం కనిపించకపోగా పంచాయతీ వ్యవస్థను అస్త వ్యస్తం చేశారు.." అంటూ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఎదుట పలువురు సర్పంచ్‌లు తమ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఏలూరు జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్ర ఆర్థిక కమిషన్ చైర్‌పర్సన్ రత్నకుమారి ఆధ్వర్యంలో ఎంపీడీవో, ఈవోపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించారు.ఏలూరు డీపీవో తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అధ్యక్షత వహించారు. రత్నకుమారి మాట్లాడుతూ స్వయం, సమృద్ధి ద్వారా ఆర్థిక వన రులు సమకూర్చుకోవాలన్నారు. డీపీవో విశ్వనాథ్ మాట్లాడుతూ వెనుకబడిన పంచాయతీలకు ప్రత్యేక గ్రాంటు విడుదల చేస్తే పంచాయతీలు బలోపేతం అవుతాయన్నారు.పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రథమ పౌరులైన తమను వైసీపీ ప్రభుత్వం ఉత్సవ విగ్రహాలుగా మార్చివేసిందని, సచివాలయ వ్యవస్థతో సర్పంచ్‌ల అధికారాలతో పాటు నిధులను కూడా లాగేసుకుందని, 14,15 ఆర్థికసంఘం నిధులను దారి మళ్లించిందని, నిధులు, విధుల కోసం పోరాటం చేయాల్సి వచ్చిందన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని కమిషన్ సభ్యులు ప్రసాద్, కృపాకర్ పేర్కొన్నారు.



రెవెన్యూ మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ నాయకులు

మంత్రి దృష్టికి క్యాస్ట్ సర్టిఫికెట్ ఇబ్బందులు

ఏలూరు రూరల్, జూలై 3: వీఆర్వోలు సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్ల విషయంలో పడుతున్న ఇబ్బందులు ఉన్నతాధికార ఒత్తిడిపై రాష్ట్ర ఐక్యవేదిక చైర్మన్ కె.ఆర్ సూర్యనారాయణతో పాటు రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు,మిర్యాల లక్ష్మీనారాయణ తదితరులు రెవెన్యూ శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి బుధవారం వినతిపత్రం అందించారు. రవీంద్రరాజు మాట్లాడుతూ వీఆర్వోలు సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్‌లో అనేక ఇబ్బందులు పడుతున్నారని, గత ప్రభుత్వంలో కులగణన ద్వారా వలంటీర్లతో చేయించిన అసమగ్ర డేటాతో వీఆర్వోల లాగిన్‌లకు రాష్ట్రవ్యాప్తంగా కొన్ని వందల సర్టిఫికెట్లు పంపించి టార్గెట్‌లు పెట్టి పూర్తిచేయాలని ఒత్తిడి చేస్తున్నారని, దీనిపై పునరాలోచించి ఉన్న తాధికారులతో చర్చించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1గా ప్రమోషన్ జీవో 166 ఇచ్చి ఏడాది అవుతున్నా ఎక్కడా అమలు చేయలేదని, సమస్యలు పరిష్కరించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బ్రహ్మానందంపై దాడి

ఉండి, జూలై 3: ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కనిగళ్ల బ్రహ్మానందంపై పలువురు యువకులు మంగళవారం రాత్రి మద్యం సేవించి దాడి చేశారు. ఉండి సంతమార్కెట్‌కు బ్రహ్మానందం వద్దకు విచ్చేసిన సమయంలో దాడికి పాల్పడినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బండాడ కేశవరావు తెలిపారు. గాంధీ చౌక్ పరిసర ప్రాంతంలో ఆకతాయిలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పోలీసులు దృష్టిపెట్టాలని, బ్రహ్మానందంపై దాడి చేసినవారిని అరెస్ట్ చేయాలని కోరారు.

సంక్షిప్త సమాచారం..

- **భీమవరం టౌన్ :** మావుళ్ళమ్మ అమ్మవారికి ఉప్పులూరుకు చెందిన దాత యర్రాసాయి మేఘనాద్ పేరున కుటుంబ సభ్యులు ఎనిమిది గ్రాముల బంగారాన్ని సమర్పించారు.
- రబీ సీజన్ 2023-24లో కోరమండల్ నిర్వహించిన గ్రోమోర్ రైతు సంబరాల కార్యక్రమంలో భాగంగా గ్రోమోర్ ఎరువులను కొనుగోలు చేసిన పెనుమంట్ర మండలం మల్లిపూడికి చెందిన రైతు కొడమంచిలి కనకరత్నంకు కంపెనీ నిర్వహించిన లాటరీలో ఆయనకు 50 గ్రాములు వెండి గెలుపొందడంతో బుధవారం వ్యవసాయ శాఖ జిల్లా జేడీ జెడ్.వెంకటేశ్వరరావు అందజేశారు.
- జంతు హక్కుల పరిరక్షణ పక్షోత్సవాల ముగింపు వేడుకల ను జిల్లా పశు సంవర్ధక శాఖ, జిల్లా జంతు సంక్షేమ సంఘం అధ్వర్యంలో భీమ వరం పశువుల ఆసుపత్రి ప్రాంగణంలో మంగళవారం నిర్వహించారు. జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె.మురళీకృష్ణ, డిప్యూటీ డైరెక్టర్ జావార్ హుస్సేన్, అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ, చెరుకువాడ రంగసాయి మాటాడారు
- **తాడేపల్లిగూడెం రూరల్ :** తాడేపల్లిగూడెంలోని నన్నయ వర్సిటీ క్యాంపస్‌లో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల వ్యతిరేక దినోత్సవంలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని నన్నయ్య వర్సిటీ ప్రొఫెసర్ టి.అశోక్ సూచించారు.
- **పెనుమంట్ర :** మావుళ్ళమ్మ అమ్మవారి 11వ ప్రభ సంబరోత్సవాలు గౌరీ శంకర దేవాంగుల యువజన సేవా సంఘం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.
- **మొగల్తూరు :** పంచాయతీ పరిధి నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెం, పాలకమ్మ చెరువు తదితర ప్రాంతాల్లో ఆకుమడులు వేసిన పొలాలలను పరిశీలించిన వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ రైతులతో మాట్లాడారు. ఆకుమడులు వేయని రైతులు వెదజల్లే పద్ధతి పాటించాలని సూచించారు.
- **పాలకొల్లు అర్బన్ :** స్థానిక కోకోనట్ మర్చంట్స్ ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని రాచగొర్ల మోహినీ దుర్గకు విట్-ఏపీ (అమరావతి)లో సీటు పొందడంతో విద్యార్థిని ప్రిన్సిపాల్ బొక్కా అప్పారావు అభినందించారు.
- పాలకొల్లు డీఎస్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన 13 మంది విద్యార్థినీలు టెక్నో టాస్క్ బిజినెస్ సొల్యూషన్స్‌కు (విజయవాడ) ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శోభారాణి తెలిపారు.
- ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి ఉచిత ఇసుక విధానం అమలు చేయడానికి సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని జిల్లా టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కర్నేన గౌరునాయుడు అన్నారు.
- **నరసాపురం రూరల్ :** మొగల్తూరు డ్రెయిన్‌ను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి పొత్తూరి రామరాజు కోరారు. డ్రెయిన్‌ను బుధవారం పరిశీలించిన ఆయన సంబంధిత అధికారులకు సమస్యను క్షేత్ర స్థాయిలో వివరించారు.
- మాధవాయిపాలెం-సఖినేటిపల్లి రేవును బుధవారం ఎంపీడీవో రమణరావు ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకుని పంట్లను తిప్పారు. సచివాలయ సిబ్బందిని షిఫ్టుల వారిగా విధుల్లో పెట్టారు.
- **భీమవరం అర్బన్ :** విద్యార్థి సంఘాలు గురువారం నిర్వహిస్తున్న దేశ వ్యాప్త విద్యా సంస్థల బంద్‌కు సీపీఎం జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెల్పిందని జిల్లా కార్యదర్శి బి.బలరాం తెలిపారు.
- **ఉండి :** యండగండి శివాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాధ్‌రాజు నిర్మించిన ఆచార్య దివాకర్ల వెంకటావదాని విగ్రహం వద్ద బుధవారం 112వ జయంతిని సాహితీ అభిమానులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.
- **ఆకివీడు :** పశువులకు ముద్దచర్మ వ్యాధి ప్రబలక ముందే వ్యాక్సిన్ చేయించాలని వెటర్నరీ మండల ఏడీ డాక్టర్ జనార్దనరావు, డాక్టర్ సత్యభార్గవి అన్నారు. ఈ వ్యాధి సోకితే పాల దిగుబడి తగ్గడమే కాకుండా ఇతర పశువులకు వ్యాపిస్తుందన్నారు.
- **పాలకొల్లు :** దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఈ నెల 8వ తేదీన ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు నియోజక వర్గ వైసీపీ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) తెలిపారు. పార్టీ నాయకులు యడ్ల తాతాజీ, చేగొండి సూర్య ప్రకాష్ మాట్లాడుతూ ఏవరికి ఏవిధమైన ఇబ్బందులు తలెత్తినా మమ్మల్ని కలవాలని సూచించారు.

ఉద్యోగ విరమణ సత్కారం

ఆచంట, జూలై3 : తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ విరమణ పొందిన ఇంజేటి గాంధీ, విజయ కుమారి, దంపతుల సన్మాన కార్యక్రమం మంగళవారం స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో నిర్వహించారు. గాంధీ దంపతులను ఆచంట, పెనుగొండ తహసీల్దార్‌లు ఐపీశెట్టి, రోహిణిదేవి, ఎంపీడీవో పి.నరసింహ ప్రసాద్, రిటైర్డ్ తహసీల్దార్ సీత, డీటీలు సంధ్యారాణి, రాజేష్, సబ్ కలెక్టర్ ఆఫీసు సిబ్బంది వీఆర్‌వోలు, పలు శాఖల అధికారులు ఘనంగా సత్కరించారు.

● కాళ్ల(ఉండి) : కాళ్ల మండలం అద్దాల కాల్వ ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయుడుగా పదవీ విరమణ చేసిన పొదిలి రామకృష్ణకు మంగళవారం సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రామకృష్ణ రచించిన ఏకాపాత్రాభినయం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఎంఈవోలు రవీంద్ర, కనకరాజు, సర్పంచ్ జగ్గరాజు, గోపిమూర్తి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందించారు.

మెకానిక్‌ల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యేలు నాయకర్, అంజిబాబు, బొలిశెట్టి

ఘనంగా ప్రపంచ మెకానిక్స్ డే


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయకర్


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజిబాబు

నరసాపురం టౌన్, జూలై 3: వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న మెకానిక్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ హామీ ఇచ్చారు. ప్రపంచ మెకానిక్స్ డేని పురస్కరించుకుని సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించి భారీ మోటర్ సైకిల్ ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సంఘం నాయకులు మారీష్, శ్రీనివాస్, చెన్ను తాతారావు, ఇమ్రాన్ పాల్గొన్నారు.

● భీమవరం టౌన్: ఒక మెకానిక్ ఒక ఇంజనీర్ తో సమానమని, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ప్రపంచ మెకానిక్స్ డే కార్యక్రమాన్ని మోటార్ సైకిల్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కిషోర్ థియేటర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అంజిబాబు పాల్గొని మాట్లాడారు. జనసేన పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్, ఏఎంసీ మాజీ చైర్మన్లు కోళ్ల నాగేశ్వరరావు, ఇందుకూరి రామలింగ రాజు, చిలుకూరి నరసింహరాజు, మెరగాని నారాయణమ్మ, అసోసియేషన్ అధ్యక్షుడు బందెల హనుమంత్, కార్యదర్శి ముమ్మన విజయ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ తోట కిరణ్ కుమార్, కోశాధికారి బీఎస్‌వీ ప్రసాద్, జాయింట్ సెక్రటరీ గెద్ద రామారావు పాల్గొన్నారు.

● తాడేపల్లిగూడెం రూరల్ : మెకానిక్‌లకు అండగా ఉంటానని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. మెకానిక్‌ల దినోత్సవం సందర్భంగా కుంచనపల్లిలో నిర్వహించిన మెకానిక్‌ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘ అధ్యక్షుడు కొమ్మిశెట్టి వెంకటరాజు, క్రమశిక్షణా కమిటీ చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు నల్లమోలు మోహన్ పాల్గొన్నారు.

● ఆకివీడు : టూ వీలర్స్ మెకానిక్స్ ఐక్యతతో ముందుకు సాగుతూ దినదినాభివృద్ధి చెందాలని టీడీపీ సీనియర్ నాయకులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు అన్నారు. ప్రపంచ టూ వీలర్ మెకానిక్ డే సందర్భంగా స్థానిక మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మెకానిక్‌లను సన్మానించి మాట్లాడారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు శింగులూరి చిట్టిబాబు, జనసేన రాష్ట్ర నాయకుడు తోట వాసు తదితరులు పాల్గొన్నారు.

● పాలకొల్లు అర్బన్ : మెకానిక్ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రెస్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమానికి మోటారు సైకిల్ మెకానిక్‌ల సంఘం అధ్యక్షుడు మీసాల రామచంద్రరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. మెకానిక్‌లు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సంఘ సభ్యులు పాల్గొన్నారు.

● తణుకు : టూ వీలర్స్ మెకానిక్‌లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మెకానిక్స్ దినోత్సవం సందర్భంగా గురుపద్మజ మోటారు మెకానిక్స్ సంఘం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని కేక్ కట్ చేశారు.

● అత్తిలి : మెకానిక్స్ డే సందర్భంగా అత్తిలిలో మెకానిక్‌ల సంఘ గౌరవాధ్యక్షుడు యడ్లపల్లి నాగేశ్వరరావు, షేక్ వలి, అధ్యక్షుడు టేకు శ్రీను, ఉపాధ్యక్షుడు చెరుకువాడ ప్రభు, సాయిబాబా, నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పోలిశెట్టి చంటి, టీడీపీ మండల అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణరావు, బీసీ సెల్ అధ్యక్షులు కోరిపల్లి హరి పాల్గొన్నారు.

మొక్క నాటడం ఆనందంగా ఉంది


ఢిల్లీలో మొక్క నాటుతున్న కేంద్ర మంత్రి వర్మ

భీమవరం టౌన్, జూలై 3 : ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఢిల్లీలో ఉక్కు మంత్రిత్వ శాఖతో కలసి తన తల్లి పేరున మొక్క నాటడం తనకు ఎంతో సంతోషంగా ఉందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమ శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధాని పిలుపుకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు.

● నరసాపురం టౌన్ : తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణం, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటారు. బీజేపీ కన్వీనర్ మేకల సతీష్, మునికోటి వెంకటేశ్వరరావు, వనమాల శ్రీనివాస్, గునిశెట్టి శ్రీను,వెంకట్, కంచర్ల నాగేశ్వరరావు, రాము, పండు, రాంబాబు పాల్గొన్నారు.

● తాడేపల్లిగూడెం రూరల్ :పట్టణంలోని జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో విద్యార్థులతో బుధవారం మొక్కలు నాటించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంఈవో వి.హనుమ, హెచ్ఎం, సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటిక స్థలాన్ని యథావిధిగా ఉంచండి

పాలకోడేరు, జూలై 3: పంతొట్టి శ్మశానవాటిక సమస్యను భీమవరం ఆర్డీఓ శ్రీనివాసులురాజు బుధవారం పరిష్కరించారు. కలెక్టర్ సూచనల మేరకు ఆర్డీవో సమస్యాత్మక ప్రాంతానికి వచ్చి ఇరు పక్షాలతో మాట్లాడారు. శ్మశాన వాటికకు కొత్తగా ఎటువంటి రహదారులు వెయవద్దని సూచించారు. ఈయన వెంట తహసీల్దార్ నాగార్జున, ఆర్ఐ నాగభూషణరావు, వీఆర్వోలు శాంతరావు, ఇంచార్జి కార్యదర్శి జార్జ్ ప్రసాద్, శ్రీవిద్య పోలీసులు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వెంపలో శ్మశాన వాటిక ఆక్రమణ

భీమవరం ఎడ్యుకేషన్ : వెంప దళితవాడ పెదపేటలో శ్మశాన భూమి ఆక్రమణకు గురైందని పీవీ రావు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవరప్రసాద్ అన్నారు. ఇప్పటి వరకు అధికారులు దానిపైన చర్యలు తీసుకోలేదన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నమండ బాలకృష్ణ, జేబీ, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మీసాల జయరాజు,జిల్లా అధ్యక్షులు బండి శ్యాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీఆర్‌కు భారతరత్న వచ్చేలా కృషి చేస్తా


ఎస్వీఆర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొలిశెట్టి, బాబ్జి

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 3: సినీ దిగ్గజం ఎస్వీ రంగారావుకు భారతరత్న వచ్చేలా తన వంతు కృషి చేస్తానని నియోజకవర్గ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఎస్వీఆర్ జయంతి వేడుకలను బుధవారం ఎస్వీఆర్ సేవా సమితి అధ్యక్షుడు రాము అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి, టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి వలవల బాబ్జి పట్టణంలోని ఎస్వీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాబ్జి మాట్లాడుతూ ఎస్వీఆర్‌కు భారతరత్న ఇవ్వాలన్నారు. గంధం సతీష్, నరిసే సోమేశ్వర రావు, మార్నీడి బాబ్జి, ఎ.నారాయణరావు, పాల్గొన్నారు. అలాగే ఆర్టీసీ ఉద్యోగులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ ఉద్యోగులు ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద బొలిశెట్టి ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల సమస్యలను విన్నారు.

● వీరవాసరం,(భీమవరం టౌన్) : ఎస్వీ రంగారావు జయంతిని వీరవాసరం కళాపరిషత్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళ్ళు అర్పించారు. యర్రంశెట్టి వెంకటరత్నం, గంటా ముత్యాలరావు నాయుడు, చవ్వాకుల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన నారుమడుల పరిశీలన

ఉండి, జూలై 3: నీటమునిగిన నారుమడులను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. యండగండి, చిలుకూరు, ఉప్పులూరు గ్రామాలలోని నారుమడులను బుధవారం పరిశీలించినట్లు సహాయ వ్యవసాయ సంచాలకులు కేఎస్ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. మండల వ్యవసాయ అధికారి సంధ్య, మేఘన, మహేంద్ర, రైతులు పాల్గొన్నారు.

కార్మిక ఉద్యమ నిర్మాత అల్లూరు జీవితం ఆదర్శనీయం

పాలకొల్లు అర్బన్, జూలై 3 : కార్మిక ఉద్యమ నిర్మాత, సీపీఎం నాయకుడు అల్లూరు సత్యనారాయణ రాజు జీవితం ఆదర్శనీయమని మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద బుధవారం అల్లూరి 10వ వర్ధంతి కార్యక్రమంలో రాజగోపాల్ మాట్లాడారు. అల్లూరి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు, గుబ్బల సత్యనారాయణ, సీహెచ్ సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

● భీమవరం అర్బన్ : కార్మిక ఉద్యమ నేత అల్లూరు సత్యనారాయణ రైస్ మిల్లు కార్మికుల వేతనలు పెంచేందుకు ఎంతో కృషి చేశారని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జేఎన్‌వీ గోపాలన్ అన్నారు. అల్లురు వర్ధంతి సందర్భంగా సీఐటీయూ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళుల అర్పించారు. నాయుకులు బి.వాసుదేవరావు, డి.కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

● పెనుగొండ : కార్మిక నాయకుడు అల్లూరి సత్యనారాయణ 10వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఎం ఆధ్వర్యంలో పూల మాలలు వేసి నివాళులర్పిం చారు. మండల కార్యదర్శి ఎస్. వెంకటేశ్వరరావు, నీలాపు ఆదినారాయణ, నాగిశెట్టి గంగారావు, శీలం ఏసు, మాదాసు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● ఆచంట : కామ్రేడ్ అల్లూరి సత్యనారాయణ ఆశయ సాధన కోసం పునరంకితం కావాలని సీపీఎం మాజీ మండల కార్యదర్శి తలుపూరి బుల్లిబ్బాయి అన్నారు. అల్లూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తోటపల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

● తణుకు : అల్లూరు సత్యనారాయణ కార్మిక సమస్యలపై జీవితాంతం పోరాడారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ అన్నారు. బుధవారం సీపీఎం కార్యాలయంలో సత్యనారాయణ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళుర్పించారు. సీఐటీయూ నాయకులు గార రంగారవు, దక్షిణామూర్తి, ఆదినారాయణ బాబు, గుబ్బల గోపి పాల్గొన్నారు.

● తాడేపల్లిగూడెం రూరల్: సీఐటీయూ వ్యవస్థాపకుడు అల్లూరు సత్యనారాయణరాజు వర్ధంతి సందర్భంగా తాడేపల్లిగూడెం పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో బుధవారం సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. రైతు సంఘ జిల్లా నాయకుడు చింతకాయల బాబూరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు సిరపరపు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు అల్లూరి జయంతి

భీమవరం టౌన్, జూలై 3 : విప్లవ వీరుడు మన్యప్రజల ఆశాజ్యోతి అల్లూరి సీతారామరాజు 127 వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించాలని అల్లూరి సీతారామరాజు యువజన సంఘాల జిల్లా అధ్యక్షుడు కంతేటి వెంకట్రాజు పిలుపునిచ్చారు. గ్రామాల్లో ఉన్న అల్లూరి విగ్రహాలను శుభ్రపరచి పూలమాలలు వేసి నివాళులర్పించాలని ఆయన కోరారు. విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 127 జయంతి సందర్భంగా 127 మొక్కలను నాటే కార్యక్రమాన్ని చైతన్య టెక్నో స్కూల్ ప్రాంగణంలో శ్రీవిజ్ఞాన వేదిక, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం సమాఖ్య ఆధ్వర్యంలో చైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ బీఎస్ రావు స్ఫూర్తితో నిర్వహించారు. అల్లూరికి జోహార్లు చెబుతూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. భీమవరం ఆర్డీవో కె.శ్రీనివాసులు రాజు, సమాఖ్య అధ్యక్షుడు కంతేటి వెంకట రాజు, క్షత్రియ నాయకులు చిలుకూరి నరసింహరాజు, ప్రిన్సిపాల్ నడింపల్లి కృష్ణంరాజు, నరహరిశెట్టి కృష్ణ, ఏవో రవికుమార్, వేణుగోపాల్, సుబ్బారావు, పీడీ నాగేశ్వరరావు విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారి పనులను అడ్డుకున్న గ్రామస్థులు

మొగల్తూరు, జూలై 3 : పంచాయతీ పరిధిలో జాతీయ రహదారులు మార్జిన్ లేకుండా వేయడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయంటూ బుధవారం స్థానికులు రహదారి పనులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు, గ్రామ పెద్దలు మాట్లాడుతూ రహదారికి మార్జిన్ లేకపోవడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పించే క్రమంలో పలు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రహదారి పనులు అడ్డుకోవడంతో తహసీల్దార్ భాస్కర్, వీఆర్వో సుభాషిణి వచ్చి వారి నుంచి వినతిని తీసుకుని నరసాపురం సబ్ కలెక్టర్‌కు అందించారు. గ్రామస్తులు పాలా రాంబాబు, తంగిళ్ళ సత్యనారాయణ, అడ్డాల రాంబాబు, అనంతపల్లి రాజా పండు, కారుమూరి ఉమా సత్య రమేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర హోం మంత్రిని కలిసిన ఎమ్మెల్యే కనుమూరు



ఉండి, జూలై 3:రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామ కృష్ణంరాజు బుధవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో కొత్తపల్లి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి రూ.లక్ష ఆర్థిక సాయం



పాలకోడేరు, జూలై 3: ఉండి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజుకు గరగపర్రుకు చెందిన టీడీపీ నాయకుడు చింతలపాటి శివనాగరాజు బుధవారం రూ.లక్ష చెక్కు అందజేశారు.

● ఉండి : నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజును బుధవారం సత్కరించి అభినందనలు తెలిపారు. ఉండిలోని నాయీ బ్రాహ్మణ సంఘం భవనాన్ని పరిశీలిస్తానని ఎమ్మెల్యే వారికి తెలిపారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లువలస వెంకట సత్యనారాయణ, సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మల్లువలస హరికృష్ణ, మల్లువలస హరీష్, జిల్లా నాయకులు ముత్యాలపల్లి రాంబాబు, మల్లువలస రవికుమార్, గొడవర్తి రాము తదితరులు పాల్గొన్నారు.

పెడన ఎమ్మెల్యేను కలిసిన టీడీపీ నాయకులు


పెడన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌ను అభినందిస్తున్న నాయకులు

పాలకోడేరు, జూలై 3: కృష్ణా జిల్లా పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌ను పాలకోడేరు మండల బీసీ టీడీపీ నాయకులు బుధవారం కలిసి అభినందనలు తెలిపారు. పాలకోడేరు మండల బీసీ గౌడ నాయకుడు కామన రాంబాబు, పెన్నాడ మాజీ సర్పంచ్ చేబోలు రామకృష్ణ, తదితరులు బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

భీమవరం రూరల్, జూలై 3 : అనాకోడేరులోని డీఎన్నార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కిట్లును బుధవారం ఎమ్మెల్యే అంజిబాబు పంపిణీ చేశారు. సర్పంచ్ జుత్తిగ దుర్గప్రసాద్, ఉపసర్పంచ్ విశ్వేస్, ఎంపీటీసీ యర్రంశెట్టి వెంకటేశ్వరరావు, జనసేన పట్టణ అధ్యక్షులు చెన్నమల్ల చంద్రశేఖర్, మండల అధ్యక్షులు రేవు వెంకన్న, జనసేన మండల అధ్యక్ష,కార్యదర్శులు మోకా శ్రీనివాస్, కత్తుల నీలేంద్ర, హెచ్ఎంలు జనసేన ఈలంపూడి కార్యదర్శి ముదుండి రమేష్‌రాజు, జెడ్పిటీసీ కాండ్రేగుల నరసింహరావు, ఎంఈవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కలగర పుట్టిన రోజు వేడుకలు


వెంకట కృష్ణకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు, జూలై 3: టీడీపీ పట్టణ అధ్యక్షుడు కలగర వెంకట కృష్ణ మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి ఆకాంక్షించారు. బుధవారం తణుకులోని వెంకట కృష్ణ నివాసంలో ఆరిమిల్లి కేక్ కట్ చేసి వెంకట కృష్ణకు తినిపించారు. పార్టీ నాయకులు డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, పరిమి వెంకన్న బాబు, మంత్రిరావు వెంకట రత్నం, సప్పారాజు, తాతపూడి మారుతీరావు, మల్లిన రాధాకృష్ణ, శేషాద్రి, శ్రీనివాసు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి

తణుకు, జూలై 3: రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ వ్యవసాయాధికారులను ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయంలో బుధవారం వ్యవసాయాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడుతూ పంట కాలాన్ని నెల రోజులు ముందుకు తీసుకెళ్ళడం జరిగిందన్నారు. దీనివల్ల పంటకు తుపాన్‌ల బెడద ఉండదన్నారు. అనంతరం వ్యవసాయాధికాలు ఎమ్మెల్యే రాధాకృష్ణకు ఎద్దుల బండి బొమ్మను బహూకరించారు. ఏడీఏ ఎంవీ రమేష్, ఏవోలు సీహెచ్ శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పెంపుపై దివ్యాంగుల హర్షం

భీమవరం అర్బన్, జూలై 3: దివ్యాంగుల పెన్షన్‌ను రూ. మూడు వేల నుంచి రూ. ఆరు వేలకు పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తు టీడీపీ సినియర్ నాయకుడు మద్దుల రాము ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులు బుధవారం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే అంజిబాబు చిత్రపటాలకు దివ్యాంగుల సంఘం అధ్యక్షులు దిడ్ల సురేష్, కాగిత వెంకన్న, కె.అప్పారావు, దాట్ల వీర్రాజు, పాలభిషేకం చేసి, కేక్ కట్ చేశారు. టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు, జనసేన పట్టణ అధ్యక్షులు చెన్నమల చంద్రశేఖర్, ఇందుకూరి రామలింగరాజు, సీనియర్ నాయకులు మెరగాని నారాయణమ్మ, గంటా త్రిమూర్తులు, గుసుపూడి తిరుపాల్, ఎద్దు ఏసుపాదం, బజాక్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్సులో షణ్ముఖ శ్రీసాయి

గణపవరం, జూలై 3: ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం లభించినట్లు గణపవరానికి చెందిన కొమ్మూరి షణ్ముఖ శ్రీసాయి బుధవారం తెలిపారు. సైబర్ సెక్యూరిటీ, ఇంటర్నెట్‌లో సైబర్ దాడుల గుర్తించి వాటికి పరిష్కారాలు తెలియజేయడం వంటివి విజయవంతంగా నిర్వహించినందుకు ఈ గౌరవం లభించిందన్నారు. గత ఆరు నెలల్లో ఐజీసీఏఆర్, ఐఐఐటీ బెంగుళూరు, ఐఐటీ ముంబయి, ఐఐటీ చెన్నై, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన వెబ్‌సైట్, ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ సైట్స్, 50 ప్రముఖ కంపెనీల్లో ఉన్న లోపాలు గుర్తించి వాటికి పరిష్కారాలు చూపినందుకు ఈ అరుదైన గౌరవం దక్కిందని తెలిపారు.

రాహుల్ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

పాలకొల్లు అర్బన్, జూలై 2 : రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీసేవిగా ఉన్నాయని వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి ఎం.సునీత, శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామి సేవా సమితి నాయకులు అన్నారు. స్థానిక ఆలయంలోని అభిషేక మండపంలో జరిగిన కార్యవర్గ సమావేశానికి అధ్యక్షుడు శీరం ఆనంద కృష్ణ అధ్యక్షత వహించారు జక్కంపూడి కుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్ ఔదార్యం

ఇరగవరం, జూలై 3 : తన సొంత సొమ్ముతో సుమారు 200 కిలోమీటర్లు ప్రయాణించి వృద్ధుడికి పింఛన్ సొమ్ము అందజేసి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ బి. మోహన్‌కిషోర్ తన ఔదార్యాన్ని చాటుకున్నాడు. పేకేరు గ్రామ పింఛనుదారుడు చిక్కా నరసింహారావు అనారోగ్యంతో మూడు నెలలుగా కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బుధవారం మోహన్ కిషోర్ కాకినాడ వెళ్లి అతనికి పింఛన్ సొమ్మును అందజేశాడు. టీడీపీ నాయకులు కిషోర్‌ను అభినందించారు.

దివ్యాంగుల క్రికెట్ సంఘం ఎన్నికలు

అత్తిలి, జూలై 3 : అత్తిలిలో విభిన్న ప్రతిభావంతుల ఆంధ్ర క్రికెట్ సంఘ ఎన్నికలు నిర్వహించినట్టు కమిటీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ తెలిపారు. సంఘ గౌరవాధ్యక్షుడిగా కారుమూరి వెంకట నాగేశ్వరరావు, అధ్యక్షుడిగా బీవీ కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా యడ్లపల్లి సూర్యనారాయణ, కార్యదర్శిగా జీఆర్ఎల్ సూర్య నారాయణరాజు, సంయుక్త కార్యదర్శిగా జి.కైలాష్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా మధుసూదన్ నాయక్, శ్రీకాంత్ ఎన్నికయ్యారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల తనిఖీలు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 3: తాడేపల్లిగూడెంలోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లను బుధవారం జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌లు తనిఖీ చేశారు. ప్రజల ప్రాణాలతో వ్యాపారమా శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఇటీవల ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు స్పందించారు. లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న నాలుగు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లపై కేసులు నమోదు చేసినట్టు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఎం. శ్రీనివాసరావు తెలిపారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఆర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ మహమ్మారిని తరిమికొట్టాలి

గణపవరం, జూలై 3: ప్లాస్టిక్‌ను రూపుమాపేందుకు సమష్టిగా కృషి చేయాలని వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు అల్లూరి గంగరాజు కోరారు. ప్రపంచ ప్లాస్టిక్ నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం గణపవరంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు.